నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# హైదరాబాద్

సోమవారం 11 డిసెంబర్ 2023
MONDAY, DECEMBER 11, 2023 | HYDERABAD | పేజీలు PAGES : 8

# బడీడు పిల్లలంతా బడిలోనే ఉండేలా..

**నేటి నుంచి బడి బయట పిల్లల గుర్తింపు సర్వే.. జనవరి 10 వరకు కొనసాగనున్న ప్రక్రియ**



మేడ్చల్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించి..విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ నేటి నుంచి వచ్చే నెల జనవరి 10 వరకు బడి బయట పిల్లల గుర్తింపు సర్వేను నిర్వహించనున్నది. 'బడీడు పిల్లలంతా బడిలోనే ఉండి చదువుకోవాలి' అనే లక్ష్యంతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. స్కూళ్లకు రాని లేదా బడిలో చేరని పిల్లలను గుర్తించి.. వారిని పాఠశాలలో చేర్పించడమే ఈ సర్వే లక్ష్యం. బడీడు పిల్లలను గుర్తించి.. వయసుకు తగ్గ తరగతిలో చేర్చుకున్నాక..వారికి అభ్యాసన సామర్థ్యాలు వచ్చే వరకు శిక్షణ ఇస్తారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే సర్వేలో క్షేత్రస్థాయిలో ఆవాస ప్రాంతాల్లో ఇంటింటా తిరిగి బడి బయట పిల్లల వివరాలను సేకరించనున్నారు. ఎలిమెంటరీ విభాగంలో 6 నుంచి 14 ఏండ్లలోపు బడి పిల్లలను.. సెకండరీ స్థాయిలో 15 నుంచి 19 ఏండ్లలోపు వారిని వేర్వేరుగా గుర్తించి జాబితాను రూపొందించనున్నారు. ఆ జాబితాలోని వివరాలను ఎప్పటికప్పుడు జాతీయ స్థాయిలోని ప్రభంద్ పోర్టల్‌లో నమోదు చేయనున్నారు. ఈ సర్వేను పకడ్బందీగా నిర్వహించేలా రాష్ట్ర విద్యా శాఖ సమగ్ర శిక్ష ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసినట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీఈవో విజయకుమారి తెలిపారు.



## ఆదివారం ఆటవిడుపు

సండే ఫన్‌డేగా మారింది. ఉద్యానవనాలన్నీ ఆటపాటలు..కేరింతలతో కిటకిటలాడాయి. కుటుంబసభ్యులతో తరలివచ్చిన నగరవాసులు..'ఆదివారం ఆటవిడుపు'తో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఉప్పల్ శిల్పారామంలో కనిపించిన దృశ్యమిది.



## పసందైన వంటకంబు.. వన భోజనంబు..

కార్తిక మాసం చివరి ఆదివారం కావడంతో నగరంలో వనభోజనాల సందడి కనిపించింది. కుటుంబసమేతంగా దగ్గరలోని ఆధ్యాత్మిక కేంద్రాలు, ఉద్యానవనాలకు తరలివెళ్లి.. పసైందన వంటకాలతో వన భోజనాలు చేసి.. ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు హైదరాబాదీలు. ఇందిరాపార్కులో వన భోజనాలు చేస్తున్న దృశ్యమిది.

# కొండల్ని తొలిచి.. కొత్త దారులు

సాఫీ ప్రయాణానికి ప్రధాన రహదారులకు ప్రత్యామ్నాయంగా లింకు రోడ్లు నిర్మించి.. ట్రాఫిక్ చిక్కులు తప్పించింది గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం. గమ్యస్థానం చేరుకునేందుకు ఎత్తయిన కొండలు, బండరాళ్లు అడ్డుగా ఉన్నా.. వెనకడుగు వేయకుండా.. కొండల్ని తొలిచి.. దారులుగా మలిచింది. ఆ రహదారులే ఇప్పుడు ఐటీ కారిడార్‌లో భారీ ట్రాఫిక్ సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తున్నాయి. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్. 51 నుంచి పాత ముంబై హైవే మార్గం, రాయదుర్గం నాలెడ్జ్ సిటీ నుంచి పాత ముంబై హైవే , బయోడైవర్సిటీ నుంచి ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ మీదుగా ఖాజాగూడ రోడ్డు, మణికొండ చిత్రపురికాలనీ నుంచి ల్యాంకో హిల్స్, అక్కడి నుంచి ఖాజాగూడ హిల్స్ మీదుగా ఔటర్ రింగు రోడ్డు వరకు నిర్మించిన పలు లింకు రోడ్లన్నీ కొండలు, గుట్టలతో కూడిన ప్రాంతాల మీదుగానే నిర్మించడం గమనార్హం.

5

– సిటీబ్యూరో, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ)





# రూ. 45 కోట్లతో నాలాల పూడికతీత..

**పనులకు టెండర్లను ఆహ్వానించనున్న జీహెచ్‌ఎంసీ**

**వచ్చే వర్షాకాలం ప్రారంభం నాటికల్లా పూర్తి చేయడమే లక్ష్యం**

సిటీబ్యూరో, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : వచ్చే వేసవి ముగింపు నాటికల్లా నాలాల పూడికతీత పనులు పూర్తి చేయాలని బల్దియా నిర్ణయించింది. ఏటా సుమారు రూ. 45 కోట్ల ఖర్చుతో 884.15 కిలోమీటర్ల మేర నాలాల్లో పూడిక తొలగింపు పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే ఈ సారి కూడా జనవరిలో ఈ ప్రక్రియ ప్రారంభించి.. జూన్ నాటికల్లా దాదాపు 5 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికతీతను చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు.. పనుల కోసం టెండర్లు ఆహ్వానించనున్నారు. వచ్చే మూడు వారాల్లో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి.. జనవరి రెండో వారానికల్లా పూడికతీత పనులను ప్రారంభించేలా సన్నాహాలు చేస్తున్నారు. కాగా, బల్దియా పరిధిలో 1368 కిలోమీటర్ల మేర నాలాలు, వరద కాలువలు ఉన్నాయి. ఏటా ఐదు లక్షల క్యూబిక్ మీటర్ల మేర నాలాల పూడికతీత పనులు చేపడుతున్నారు. గతంలో మాదిరిగానే ఈ సారి కూడా నాలాల్లో పూడిక తొలగింపు పనులు ఆరుగురు ఎస్ఈలు, ఆయా జోనల్ కమిషనర్ల పర్యవేక్షణలో సాగనున్నాయి. ప్రత్యేక యాప్, వెబ్‌సైట్ ద్వారా ఏ రోజు ఎక్కడ పనులు జరుగుతున్నాయి? ఏ మేరకు జరిగాయనే అంశాలను పర్యవేక్షిస్తూ పనులను అత్యంత పారదర్శకంగా నిర్వహించనున్నారు.